క్లుప్తంగా

నేడు రామచంద్రాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం

విస్సన్నపేట: కలగర సచివాలయం పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో గురువారం ఉదయం 7 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పాల్గొని గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాల అమలును వివరిస్తారన్నారు. అనంతరం తాతకుంట్ల గ్రామంలో జలజీవన్‌మిషన్ నిధులు రూ. 24 లక్షలతో ఇంటింటికీ కుళాయి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేస్తారని వివరించారు.

'పది' సైన్స్ పరీక్షకు 113 మంది గైర్హాజరు

నూజివీడు: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా పట్టణంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన సైన్స్ పరీక్షకు 113 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 662 మందికి 549 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఎస్ఆర్ఆర్ హైస్కూల్ సెంటర్‌లో 155 మందికి 133 మంది, బాలికల జెడ్పీ హైస్కూల్‌లో 142కు 117మంది, సెయింట్ థామస్ హైస్కూల్లో 120 మందికి 101 మంది, సెయింట్ ఆన్స్ హైస్కూల్లో 97 మందికి 73 మంది, లేయా జోన్స్ హైస్కూల్లో 148 మందికి 125 మంది పరీక్షలకు హాజరయ్యారు. ప్రశాంతంగా పరీక్షల నిర్వహణకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి, 144 సెక్షన్ విధించారు.

మజ్జిగ పంపిణీ

గంపలగూడెం: వేసవి తీవ్ర ఉష్ణోగ్రతల నేపథ్యంలో గంపలగూడెం జెట్ వికాస తరంగిణి ఆధ్వర్యంలో చేపట్టిన మజ్జిగ పంపిణీ కార్యక్రమం 50వ రోజు బుధవారం కొనసాగింది. స్థానిక భజన మందిరం వద్ద రోజూ దాతల సహకారంతో మజ్జిగ పంపిణీని మధ్యాహ్నం చేస్తున్నారు. వికాస తరంగిణి అధ్యక్షులు కొల్లా కృష్ణకుమారి ఆధ్వర్యంలో పలువురు తరంగిణీ సభ్యులు సేవలు అందజేశారు.

తిరువూరు: స్థానిక బోస్ సెంటర్లో వాసవీ క్లబ్ ఆధ్వర్యా బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఇక్కడ 60 రోజులుగా చలివేంద్రం నడుస్తోంది. వాసవీ క్లబ్ అధ్యక్షుడు దోసపాటి రవి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

కేవీలో జాతీయ విద్యా విధానంపై అవగాహన



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు కేంద్రీయ విద్యాలయంలో బుధవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానం 2020పై అవగాహన నాటిక పోటీని ప్రిన్సిపాల్ పీవీఎస్ఆర్ కృష్ణ ప్రారంభించారు. రోజుకో కళా ప్రక్రియతో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. జన్వాగిరీ పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, యోగ్యత ఆధారిత విద్య, వృత్తి విద్య, ప్రయోగాత్మక అభ్యాసనంపై అవగాహన కల్పించి విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీస్తామన్నారు.

ఎదురెదురుగా రెండు బైకులు ఢీ

భార్యాభర్తలకు గాయాలు

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో భార్యాభర్తలు గాయపడ్డారు. మండలంలోని తుమ్మలపాలెం వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై బుధవారం ఘటన జరిగింది. కొండపల్లి గ్రామిక నగర్‌కు చెందిన వేముల శ్రీనివాస్.. భార్యతో కలసి బైకుపై విజయవాడ వైపు వెళ్తున్నారు. తుమ్మలపాలెం వద్ద అదే గ్రామానికి చెందిన కె.మురళీకృష్ణ ఎన్టీటీపీఎస్‌లో విధులకు హాజరవ్వడానికి రాంగ్‌రూట్‌లో వస్తూ శ్రీనివాస్ బైక్‌ను ఢీకొట్టాడు. శ్రీనివాస్‌తో పాటు అతని భార్య నడుముకు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని స్థానికుల సహకారంతో విజయవాడ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశానవాటికలో బోరు ఏర్పాటు



రోలుపడి(తిరువూరురూరల్): రోలుపడి గ్రామ శివారులోని ఎస్సీ శ్మశాన వాటికలో మంచినీటి కొరత నివారణకు బుధవారం బోరు నిర్మించారు. దీర్ఘకాలంగా శ్మశాన వాటికలో నీటి కొరత ఉండటంతో అంత్యక్రియల నిర్వహణకు ఇబ్బందులు కలుగుతున్నాయి. బోరు నిర్మించాలని ఎస్సీ కాలనీవాసులు కోరారు. పంచాయతీ సర్పంచి కొంతమ్మ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ రవికుమార్ ఆధ్వర్యంలో బోరు పనులు జరిగాయి.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

కె.అగ్రహారం(జగ్గయ్యపేట): ఈ నెల ఎనిమిదవ తేదీ గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న గ్రామ దేవతలకు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ముత్యాలమ్మ అమ్మవారితో పాటు సహ దేవతలు ఊరి ముత్యాలమ్మ, మద్దిరావమ్మ, మహాలక్ష్మమ్మ, సుబ్రహ్మణ్య స్వామి వారి విగ్రహాలకు గ్రామస్తులు జలబిందెలతో గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకుడు రామకృష్ణ శాస్త్రి ఆధ్వర్యంలో ఊరేగింపు చేశారు.

క్రీడల అభివృద్ధికి చర్యలు

- అన్నవరం వద్ద స్టేడియం
- గాంధీనగర్‌లో ఆటస్థలం అభివృద్ధికి ఏర్పాట్లు
- ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడు గాంధీనగర్‌లో ఆటస్థలం వివరాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు : పట్టణంలో ఆటల అభివృద్ధికి, క్రీడాస్థలాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చెప్పారు. పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న 5.21 ఎకరాల ఆటస్థలాన్ని బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మేకా వెంకట సుకుమార్ అప్పారావు 2.46 ఎకరాలను దానం చేయగా, మేకా వెంకట మనోహర్ అప్పారావు 2.75 ఎకరాలను స్పోర్టింగ్ క్లబ్‌కు అమ్మారని, అయితే ఈ ఆటస్థలం గత 30 ఏళ్లుగా నిరుపయోగంగా ఉంటోందన్నారు. ఈ పరిస్థితిలో దీన్ని అభివృద్ధి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. ఆటస్థలంలో పెరిగిన కంప చెట్లను తొలిగించే పనులను రెండు రోజుల్లో చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. ఇక్కడ వాలీబాల్, షటిల్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్ తదితర కోర్టులను ఏర్పాటు చేయడంతో పాటు క్రికెట్ గ్రౌండ్‌ను సైతం సిద్ధం చేస్తామని వివరించారు. విస్సన్నపేట రోడ్డులో గురుకుల పాఠశాల వద్ద ఉన్న తొమ్మిది ఎకరాల స్థలంలో రంజీట్రోఫీలు, పెద్ద టోర్నమెంట్‌లు నిర్వహించుకునేలా క్రికెట్ గ్రౌండ్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. త్వరలోనే గ్రౌండ్ లెవెలింగ్‌కు, గ్రాస్ ఏర్పాటుకు, గ్రౌండ్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడానికి కోటి రూపాయలతో అధికారులు టెండర్‌ను పిలవనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. తర్వాత విడతల వారీగా పెవిలియన్, గ్యాలరీ వంటి సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, తహసీల్దార్ డీవీఎస్ ఎల్లారావు, డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, సీఐ ఎంవీఎస్ఎన్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ఇళ్ల నిర్మాణాలు

మైలవరం: పేదలు సొంతింటి కల సాకారం చేసుకోవడానికి ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచారు. నవరత్నాలులో భాగంగా నిరుపేదలకు ఇళ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం సహకరిస్తోంది. దీంతో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. అద్దె ఇళ్లలో ఉంటున్న తాము సొంతింటి యజమానులం అవుతామని ఊహించలేదని, జగన్ అధికారంలోకి రావడంతో తమ సొంతింటి కల నెరవేరిందని చంద్రాల గ్రామానికి చెందిన సత్యాల పద్మ, మైలవరం గ్రామానికి చెందిన టి.ఏసు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలో 15,687 మందికి ఇళ్ల స్థలాలు, 12,450 మందికి వైఎస్సార్ గృహాలు మంజూరయ్యాయి. వీటిలో 60శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయి. మరో 30శాతం వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. మైలవరం మండలంలో 3200 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. మండలంలో ఇప్పటికే 70 శాతం మంది నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. మరో 20 శాతం నిర్మాణాలు జరుగుతున్నాయి. మైలవరం మండలం చంద్రాల గ్రామంలో 14 నిరుపేద గిరిజనుల(ఎరుకలు)కు జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలు ఇచ్చారు. వారిలో సగం మందికి పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని నివసిస్తున్నారు. జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీరు, రోడ్లు కూడా ఏర్పాటు చేశారు.



చంద్రాల జగనన్న కాలనీలో ముమ్మరంగా ఇళ్ల నిర్మాణాలు

జగన్.. ఇల్లు ఇచ్చిన దేవుడు



చంద్రాల గ్రామంలో నాకు ఉన్న ఇంటిని కొడుకు, కోడలు తీసుకుని, నాకు ఇల్లు లేకుండా చేశారు. కొంత కాలం తెలిసిన వారి వద్ద ఉన్నాను. ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత నాకు స్థలం ఇవ్వడమే గాక ఇంటి నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేయడంతో నిర్మాణం పూర్తి చేసుకున్నాను. మా గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు జొన్నలగడ్డ గంగాధరరావు గిరిజన సంక్షేమ శాఖ నుంచి రూ.70వేలు అదనంగా నిధులు మంజూరు చేయించారు. దీంతో ఇల్లు పూర్తి చేసుకున్నాను. సొంత ఇల్లు ఇప్పించిన జగన్ మాకు దేవుడు.

– సత్యాల పద్మ, లబ్ధిదారు, చంద్రాల

డ్రిప్ పద్ధతిలో ఎరువులు అందిస్తే నష్ట నివారణ



వెల్వడంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు

వెల్వడం(మైలవరం): డ్రిప్ పద్ధతిలో పంటలకు ఎరువులు అందిస్తే నష్టం నివారించవచ్చని ఎన్టీఆర్ జిల్లా వనరుల కేంద్రం, జిల్లా శిక్షణ కోఆర్డినేటర్ టి.మాధవీలత తెలిపారు. మైలవరం మండలం వెల్వడంలోని వెల్వడం-1, రైతు భరోసా కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం, ఎన్టీఆర్ జిల్లా శిక్షణ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో బుధవారం ఒక్కరోజు శిక్షణ జరిగింది. మాధవీలత మాట్లాడుతూ వేసవి దుక్కులు, పచ్చిరొట్ట ఎరువుల ఆవశ్యకత, మట్టినమూనాలు, విత్తన శుద్ధి ఆవశ్యకతను వివరించారు. మిషన్ లైఫ్ శిక్షణలో భాగంగా మోటార్లు, కరెంట్ స్విచ్‌లను ఉపయోగించిన అనంతరం స్విచ్ ఆపాలని సూచించారు. తక్కువ నీరు ఉపయోగించుకునే అపరాలు, చిరుధాన్యాలు వంటివి పెంచాలని, ఎరువులను డ్రిప్ పద్ధతిలో అందించాలని తెలిపారు. వేప, తులసి, కరివేపాకు తదితరాలు పెంచుకోవాలన్నారు. మైలవరం ఏడీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రంలో 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు, కిలోకి రూ.5 రాయితీపై వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మట్టి నమూనాలు తీసే పద్ధతిని డెమో ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఏఓ పి.మోనీషా, ఏఓ సంధ్యారాణి, వీఏఏ సాయిశివరామకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రెయిన్ల అభివృద్ధి పనులు

వెల్వడం(మైలవరం): వెల్వడం గ్రామం బీసీ కాలనీలో డ్రెయినేజీల అభివృద్ధి పనులు బుధవారం వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు ఆర్. రామ్‌భూపాల్‌రెడ్డి ప్రారంభించారు. వెల్వడం గ్రామస్తులు, ప్రవాసాంధ్రులు దాత డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి దాతృత్వంతో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ స్ఫూర్తితో పొక్లెయిన్ ఏర్పాటు చేసి డ్రెయిన్లలో పూడికతీత, తూములు ఏర్పాటు తదితర పనులను చేపట్టారు. తొలుత రామ్‌భూపాల్‌రెడ్డి, సర్పంచ్ ధర్మరాజు, ఎంపీటీసీ ఉదయభాస్కర్ రెడ్డి, తిరుపతిరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.

బాలికా సంరక్షణకు సహకరించాలి



తిరువూరు: బాలికల అక్రమ రవాణా అరికట్టడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ చంద్రయ్య పిలుపునిచ్చారు. తిరువూరులో బుధవారం ఇందిరా క్రాంతి పథం (వెలుగు), డీఆర్‌డీఏ, ప్రజ్వల సంస్థలు సంయుక్తంగా బాలికల అక్రమ రవాణాపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శన, సదస్సు నిర్వహించారు. పోలీస్, స్త్రీ శిశు సంక్షేమ, న్యాయశాఖల సహకారంతో ఇంతవరకు 27వేల మంది బాలికలను అక్రమ రవాణా నుంచి సంరక్షించినట్లు ప్రజ్వల కోఆర్డినేటర్ చంద్రయ్య తెలిపారు. వెలుగు ఏపీఎం గురవయ్య, ప్రజ్వల ఏరియా సమన్వయకర్త రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరింగ్ పగలగొట్టడంపై ఫిర్యాదు



పాఠశాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

పుట్రేల (విస్సన్నపేట): పుట్రేల గ్రామంలోని నార్త్‌లో ఉన్న ఎంపీపీ పాఠశాలలో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో కొంతమంది ఎటువంటి అనుమతులు లేకుండా ఫ్లోరింగ్ పగలకొట్టారు. దీనిపై గ్రామ పెద్దలు, యువకులు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ జీవీవీ సత్యనారాయణ బుధవారం పాఠశాలలో పగలకొట్టిన ఫ్లోరింగ్‌ను పరిశీలించి గ్రామస్తుల నుంచి సమాచారం సేకరించారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరుగుతుందని ఎస్‌ఐ అన్నారు. సర్పంచ్ కారుమంచి స్వాతి పాఠశాలను పరిశీలించారు.

కొండపల్లి సెక్షన్‌లో విద్యుత్ అధికారుల ఆకస్మిక తనిఖీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): విద్యుత్ శాఖ అధికారులు కొండపల్లి సెక్షన్‌లో బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యుత్ విజిలెన్స్ ఏడీఈ బి.నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో 40 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశాయి. నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న 2,808 విద్యుత్ సర్వీసులు తనిఖీచేసి అపరాధ రుసుం రూ.6.10 లక్షలు వసూలు చేశారు. అధికలోడు వాడుతున్న వినియోగదారులు లోడును క్రమబద్ధీకరణ చేయించుకోవాలని సూచించారు. దాడుల్లో ఇబ్రహీంపట్నం ఏడీఈ కేవై కొండలరావు, ఈఈ జీబీ శ్రీనివాసరావు, కొండపల్లి ఏఈ సుబ్బారావు, విజయవాడ రూరల్ డివిజన్ పరిధిలో పలువురు ఏఈలు, ఏడీఈలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులను వేగవంతం చేయండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలకసంస్థ ఆవరణలో నిర్మాణంలో ఉన్న నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మున్సిపల్ అధికారులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. భవన నిర్మాణానికి సంబంధించి స్థితిగతులు, అక్కడ అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా నూతన భవనంలోని గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆగస్టులో గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌లను ప్రారంభించే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణ పరిస్థితిని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పని తీరును మెరుగుపరుచుకోవాలని ప్రజారోగ్య శాఖ అధికారులను హెచ్చరించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఆవరణలో ప్రజారోగ్య శాఖాధికారులు ప్రతి రోజూ ఉదయం క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణ తీరును పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ప్రభాకరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరెడ్డి, డీఈఈ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లు రక్తదాతల్లో చైతన్యం తేవాలి

గన్నవరంరూరల్: రక్తదాతలతో కౌన్సిలర్‌లు మాట్లాడి వారిలో చైతన్యం తేవాలని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల పెథాలజీ ప్రొఫెసర్ కల్యాణ చక్రవర్తి కౌన్సిలర్లకు మార్గనిర్దేశం చేశారు. స్థానిక కళాశాలలో బుధవారం ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీ సాక్స్) ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి మెడికల్ కళాశాలల బ్లడ్ కౌన్సిలర్‌ల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్(నాకో) ఆదేశాల మేరకు డొనేషన్ ముందు రక్తదాతకు సమాచారం ఇవ్వాలని, డొనేషన్ చేసినప్పుడు, అనంతరం సైతం కౌన్సెలింగ్ చేయాలన్నారు. దేశంలో రక్తదాతల సంఖ్య పెంచేందుకు, నిల్వలు పెంచేందుకు కృషి జరగాలన్నారు. రక్తదానం చేయడం మంచి విషయమన్నారు.అసిస్టెంట్ ప్రొఫెసర్ జాస్మిన్ సుల్తానా నాకో నిబంధనలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ



హెల్త్ క్లినిక్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ రూరల్ మండలం నున్న- 2 పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో బుధవారం ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ సమయంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల వ్యాక్సినేషన్ ప్రోగ్రామ్‌ను తనిఖీ చేశారు. ఆ కేంద్రంలో మల్టీలెవల్ హెల్త్ ప్రొవైడర్ అందిస్తున్న సేవలను పరిశీలించారు. క్లినిక్‌లో మందులు, ల్యాబ్ పరీక్షలు, ఇతర అంశాలను సమీక్షించారు. వైద్యం కోసం వచ్చే ప్రతి ఒక్కరికీ సక్రమంగా సేవలు అందించాలని సూచించారు. అనంతరం నున్న -1 హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవం విషయమై సమీక్షించారు. కార్యక్రమంలో ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ సమీర, డాక్టర్ శ్రావణి, హెల్త్ క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రశేఖరస్వామి ఆలయ ప్రతిష్ఠ



యాగశాలలో హోమాల మధ్య శాంతి కల్యాణంలో దంపతులు

గన్నవరంరూరల్: మండలంలోని పురుషోత్తపట్నం శ్రీ పార్వతీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవం బుధవారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య భక్తి ప్రవత్తులతో నిర్వహించారు. గణపతి, శివలింగం, పార్వతి, కుమారస్వామి, ద్వారపాలక, నందీశ్వర, ధ్వజ, బలపీఠ, చండీశ్వర, కాలభైరవ, నాగబంధ, నవగ్రహ ప్రతిష్ఠలు గడచిన అయిదు రోజులుగా పంచాహ్నిక దీక్షతో నిర్వహించారు. గణపతి శర్మ పర్యవేక్షణలో ఉదయం గవ్యాంత పూజలు నిర్వహించి యంత్రస్థాపన చేశారు. భక్తుల జయజయ ధ్వానాల మధ్య ధ్వజ స్తంభాన్ని నిలబెట్టారు. అనంతరం దంపతులు స్వామివారికి శాంతి కల్యాణం నిర్వహించారు. యాగశాల వేదపండితుల మంత్రాలతో, విశేష పూజలతో అలరించింది. అనంతరం శివకేశవ ఆలయ అభివృద్ధి కమిటీ పండిత సత్కారం చేసింది. వేలాది మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. పురుషోత్తపట్నం గ్రామం ప్రతిష్ఠా ఉత్సవంతో తరలివచ్చిన భక్తులతో నిండిపోయింది.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు



తిరువూరు గ్రంథాలయంలో విద్యార్థులకు పద్యపఠన పోటీలు



పెనుగొలనులో కవుల చిత్రపటాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నూజివీడు: పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు రిటైర్డ్ ఎంఈవో వంగల గోవిందరావు జాతీయ నాయకుల గురించి అవగాహన కల్పించారు. సుభాష్ చంద్రబోస్, స్వామి వివేకానంద, సర్దార్ వల్లభాయ్‌పటేల్, మహాత్మాగాంధీ, ఝాన్సీ లక్ష్మీబాయి, భగత్‌సింగ్ జీవిత చరిత్రలను వివరించారు. అనంతరం బాలసాహిత్యానికి సంబంధించిన కథలను చదివించారు. తదుపరి విశ్రాంత ఉపాధ్యాయులు ఈమని శేషయ్య విద్యార్థులచే దేశభక్తి గీతాలను పాడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు, సిబ్బంది యశ్వంత్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

గొల్లపల్లిలో..

మండలంలోని గొల్లపల్లి శాఖ గ్రంథాలయంలో బుధవారం వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి ప్రథమస్థానంలో నిలిచిన వారిని అభినందించారు. మహిళా పోలీస్ అనూష విద్యార్థులకు మంచి అలవాట్లు, సెల్‌ఫోన్‌లను వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డొక్కు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తిరువూరు: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి పద్మావతి పర్యవేక్షణలో ఉపాధ్యాయులు నిర్వహించిన పోటీల్లో పలువురు విద్యార్థినులు పౌరాణిక, సాంఘిక పాత్రలు పోషించారు. విజేతలకు బహుమతులు ఇచ్చారురు. తెలుగు భాషా వికాస సమితి కన్వీనర్ ఉమామహేశ్వరరావు గ్రామర్, పద్య పఠన పోటీలు నిర్వహించారు.

పెనగొలను(గంపలగూడెం): పెనుగొలను శాఖ గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ప్రదర్శించిన కవులు, రచయిత చిత్రపటాల ప్రదర్శన ఆకట్టుకుంది. తొలుత నజీరుద్దీన్ కథలు, పిల్లల నీతి కథలు పఠనం చేశారు. విజేతలకు సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ మహమ్మద్ గాలి పాహిద్ బహుమతులు అందజేశారు. షిరిడీ సాయి సేవ సమితి ఆధ్వర్యంలో కవులు, రచయితల చిత్రపటాలను ప్రదర్శించారు. సాయి సేవాసమితి సభ్యులు నారాయణరావు, పసుపులేటి శ్రీను, ఉపాధ్యాయులు నరసింహారావు, నాగరాజు, శ్రీనివాసరావు, పాఠకులు, గ్రంథాలయ అధికారి జ్యోతిర్మయి పాల్గొన్నారు. గంపలగూడెం శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు క్రాంతికుమార్ సులభ రీతిలో గణితం, విధానాలు వివరించారు. గ్రంథాలయ నిర్వహణాధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మునునూరు: క్విజ్ పోటీలతో చిన్నారుల్లో చురుకుదనం, పోటీతత్వం అలవడతాయని పలువురు ఉపాధ్యాయులు సూచించారు. గోపవరం గ్రంథాలయంలో బ్రాంచి అధికారి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో 31 వరోజు బుధవారం చిన్నారులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం చిన్నారులు శిక్షణా శిబిరంలో నేర్చుకున్న నీతి కథలపై సమీక్ష నిర్వహించారు.

పుట్రేల మారెమ్మ హుండీ ఆదాయం రూ.5 లక్షలు

పుట్రేల (విస్సన్నపేట): మండలంలోని పుట్రేలలో ఉన్న మారెమ్మ దేవస్థానానికి చెందిన నాలుగు హుండీల్లో కానుకలను బుధవారం లెక్కించినట్లు ఆలయ ఈఓ వై. సీతారామయ్య తెలిపారు. విజయవాడ దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోటగిరి సునీల్ బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు, పోలీస్, రెవెన్యూ అధికారులు, సత్యసాయి భక్త సమాజం సభ్యులు, భక్తుల సమక్షంలో లెక్కించారు. 47 రోజులకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు రూ.5,38,929 వచ్చినట్లు ఈఓ తెలిపారు.

- విస్సన్నపేట చంద్రశేఖరస్వామి దేవస్థానంలో హుండీలను దేవదాయశాఖ ఈఓ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో బుధవారం లెక్కించినట్లు ఈఓ వై సీతారామయ్య తెలిపారు. 130 రోజులకు భక్తులు సమర్పించిన కానుకలు రూ.2,58,376 వచ్చినట్లు ఈఓ తెలిపారు. స్థానిక పెద్దలు కుక్కడపు హనుమాన్ వెంకటరత్నం, ఎస్ఆర్ కృష్ణ, సత్యసాయి భక్తసమాజం సభ్యులు సమక్షంలో లెక్కించారు.

దుర్గమ్మ సన్నిధిలో సంకటహరచతుర్థి



గణపతికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకుడు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో బుధవారం సంకటహర చతుర్థిని పురస్కరించుకుని గణపతి స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి స్వామి మందిరం వద్ద యాగశాలలో గణపతి స్వామివారికి అభిషేకాలు, హోమం చేశారు. హోమంలో దుర్గ గుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబలతో పాటు ఆలయ వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు హోమాన్ని వీక్షించేలా దేవస్థాన అధికారులు ఏర్పాట్లు చేశారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి వరకు మొక్కజొన్న కొనుగోళ్లు

చాట్రాయి : రబీలో పండించిన మొక్కజొన్న పంటను ఈ నెల 9 వరకు కొనుగోలు కేంద్రాల ద్వారా తీసుకుంటామని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ బుధవారం తెలిపారు. రైతులు వినియోగించుకోవాలని కోరారు.

బాలలను పరిరక్షించాలి

రామవరప్పాడు: ఆపదలో ఉన్న బాలలను పరిరక్షించడం మనందరి బాధ్యతని, ఆపదలో ఉన్న వారిని గుర్తించి కాపాడుకుందామని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరులోని సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌లో బుధవారం ముఠా కార్మికులకు 'బాలల పరిరక్షణ'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు బాలలతో పనిచేయించడం నేరమన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించిన తల్లిదండ్రులు, సంరక్షకులు కూడా శిక్షార్హులు అవుతారన్నారు. బాలలు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూడాలన్నారు. మత్తు పదార్థాల వ్యసనం నుంచి బయటకు తీసుకురావడానికి నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో నూజివీడు సమీపంలోని పోలసానిపల్లి గ్రామంలో బోస్కో డీ ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.